క్లుప్తంగా

కబ్జా నుంచి చెరువును కాపాడండి

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువును కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాలాపూర్ మాజీ ఉప సర్పంచ్ హామెద్ అజీజ్ కోరారు. ఈ మేరకు ఆయన బాలాపూర్ తహసీల్దార్ జనార్దన్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాలకు జీవనాధారంగా ఉన్న చెరువులో మట్టి పోసి కబ్జా చేయడం సరికాదన్నారు. సర్వే నంబర్ 69 పరిధిలోకి వచ్చే ఈ స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులపై ఉందన్నారు. అధికారులు స్పందించి ఈ స్థలాన్ని కాపాడాలని.. లేనియెడల ప్రత్యక్ష ధర్నాలకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

ముగింపు సభకు పంచాయతీ కార్మికులు



కందుకూరు నుంచి సభకు వెళ్తున్న పంచాయతీ కార్మికులు

కందుకూరు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయా మండలాల్లో పాదయాత్ర నిర్వహించి మంగళవారం హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన ముగింపు సభకు సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు తరలివెళ్లారు. ఈ నెల 12నుంచి పాదయాత్ర చేపట్టి చివరి రోజు ర్యాలీ నిర్వహించిన అనంతరం ముగింపు సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వీఎంహోంలో జాతీయ సైన్స్‌డే



విద్యార్థులు రూపొందించిన నమూనాలు తిలకిస్తున్న హోం కార్యదర్శి అఖిలేశ్ రెడ్డి

హుడాకాంప్లెక్స్: జాతీయ సైన్స్‌డేను పురస్కరించుకుని వీఎంహోంలో మంగళవారం సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హోం కార్యదర్శి అఖిలేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు తయారు చేసిన వస్తువులను అడిగి తెలుసుకుని పనిచేసే విధానాన్ని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభుదాస్, సూపరిటెండెంట్ లక్ష్మీపార్వతి, వైస్ ప్రిన్సిపాల్ మాధురి, శివప్రసాద్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలుంటే ఫిర్యాదు చేయండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శానిటేషన్ సిబ్బంది

బడంగ్‌పేట్: కార్పొరేషన్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శానిటేషన్ నిర్వాహకులు విద్యార్థులకు వీధి కుక్కల నుంచి స్వీయ రక్షణ చర్యలపై మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వీధికుక్కలు వెంట పడుతున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, వీధికుక్కలు కనిపిస్తే మునిసిపల్ కార్పొరేషన్‌కు ఎలా ఫిర్యాదు చేయాలో వివరించారు. అనంతరం బడంగ్‌పేట్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలాపూర్‌లోని 17వ డివిజన్‌లో వీధికుక్కలను పట్టుకుని వేరే చోటుకు తరలించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, హెచ్ఎం కె.అర్జున్, కోఆర్డినేటర్ దేవేందర్, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ యువజన విభాగం అధ్యక్షుడి నియామకం



నియామకపత్రం అందజేస్తున్న ఇందుజారెడ్డి

కందుకూరు: వైఎస్సార్‌టీపీ మహేశ్వరం నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడిగా మండల పరిధిలోని రాచులూరుకు చెందిన పి.శివకుమార్‌గౌడ్ నియమితులయ్యారు. ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు పార్టీ యూత్ విభాగం రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ ఇందుజారెడ్డి మంగళవారం ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

కల్వర్టు నిర్మించారు.. మరమ్మతులు మరిచారు.!

- నిత్యం ప్రమాదాలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



హైదరాబాద్–శ్రీశైలం రహదారిపై కల్వర్టు నిర్మించి రోడ్డు మరమ్మతులు చేపట్టని ప్రాంతం

కందుకూరు: జాతీయ రహదారిపై కల్వర్టు నిర్మించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో పరిస్థితి. ప్రమాదకరంగా మారింది. ఆ ప్రాంతాన్ని సరిగ్గా అంచనా వేయలేక వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇది మండల కేంద్రంలోని హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై దుస్థితి.

మరమ్మతులు పూర్తి చేయకుండా

హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై కందుకూరు చౌరస్తాలో రైస్ మిల్ ప్రాంతంలో రోడ్డు విస్తరణకు గతంలో అక్కడ ఉన్న పాత కల్వర్టును కాంట్రాక్ట్ సంస్థ తన ఇష్టానుసారంగా తొలగించి రోడ్డు నిర్మించింది. దీంతో అప్పటి నుంచి కొన్ని ఏళ్లుగా వర్షాకాలంలో చిన్నపాటి వర్షం కురిసినా ఆ ప్రాంతం అంతా చెరువును తలపించేలా రోడ్డుపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. ఓ పక్క రోడ్డును మూసి వేసి, మరోపక్క నుంచే రాకపోకలు సాగించే వారు. దీంతో స్థానికులు, వాహనదారుల ఆందోళనతో నేషనల్ హైవే అధికారులు గతంలో కల్వర్టు ఉన్న ప్రాంతంలో తిరిగి రోడ్డును తవ్వి కొత్త కల్వర్టును నిర్మించారు. మొదట ఓ వైపు పూర్తి చేసిన అధికారులు, ఇటీవల రెండో వైపు పనులు పూర్తి చేశారు. కాగా కల్వర్టు పూర్తి చేసిన తర్వాత రోడ్డు తవ్వడంతో ఏర్పడ్డ గుంతలు పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారింది. కల్వర్టు ఉన్న ప్రాంతంలో రోడ్డు సమాంతరంగా లేకపోగా, ఇసుక ఉండటంతో వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అకస్మాత్తుగా అక్కడికి వచ్చిన తర్వాత బ్రేక్ వేయడంతో వెనుక వచ్చే ఇతర వాహనాలు వరుసగా ఢీకొన్న సంఘటనలు అనేకం. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ఇప్పటికే పలువురు గాయపడ్డారు. రాత్రి వేళలో పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. మరోపక్క వీధి దీపాలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా వాటికి విద్యుత్ కనెక్షన్ ఇంత వరకు ఇవ్వలేదు. రాత్రి వేళలో ఇక్కడ ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యల పరిష్కరించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రయాణికులు గాయాలపాలు



కల్వర్టు పూర్తి చేసి రోడ్డు మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో ఇప్పటికే చాలా మంది ప్రమాదాల బారిన పడ్డారు. ఇక్కడికి వచ్చి అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ప్రమాదాలు జరిగి గాయపడుతున్నారు.

– వెంకటేశ్, కల్వర్టు పక్కన దుకాణాదారుడు

ఇబ్బందిగా మారింది



కల్వర్టు నిర్మించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో ఇబ్బందిగా మారింది. రోజు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. రాత్రి వేళలో వీధి దీపాలు లేక సమస్య అధికంగా ఉంది. ఇసుక, మట్టిని తొలగించి మరమ్మతులు పూర్తి చేయాలి.

– కె.వెంకటేష్‌గుప్తా, కందుకూరు

పాఠశాలకు అనుమతివ్వొద్దు



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మంత్రికి న్యూ నందిహిల్స్‌కాలనీ ఫేజ్–1 వాసుల వినతి

మీర్‌పేట: విరివిగా ప్రమాదాలు జరిగే చోట నిర్మిస్తున్న ప్రైవేటు పాఠశాలకు అనుమతులు ఇవ్వొద్దని మీర్‌పేట కార్పొరేషన్ 9వ డివిజన్ న్యూ నందిహిల్స్ కాలనీ ఫేజ్–1 వాసులు మంగళవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్ నెం–3 మలుపు వద్ద రహదారి చిన్నగా ఉండడంతో పాటు నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుందని, ఇలాంటి చోట కేవలం 320 గజాల స్థలంలో పాఠశాలను నిర్మించడం వల్ల విద్యార్థులు రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని మంత్రికి వివరించారు. దీంతో పాటు కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతారని, కావున పాఠశాల నిర్మాణం చేపట్టకుండా చూడాలని మంత్రిని కోరారు. వెంటనే స్పందించి ఆమె స్కూల్ నిర్మాణాన్ని అడ్డుకుని చర్యలు తీసుకోవాలని డీఈఓ, ఎంఈఓలను ఆదేశించినట్లు కాలనీవాసులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి నర్సిరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు హమునాయక్, సత్యనారాయణ, శిశుపాల్‌రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి చల్లా సురేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

ఎస్ఎన్‌డీపీ పనులకు చర్యలు

మేయర్ దుర్గ

మీర్‌పేట: మంత్రి ఆదేశాల మేరకు ఎస్ఎన్‌డీపీ నాలా పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ తెలిపారు. కాలనీలవాసుల విజ్ఞప్తి మేరకు మేయర్ మంగళవారం 36వ డివిజన్‌లో అధికారులతో కలిసి పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగంగా కొన్ని చోట్ల తాగునీటి పైపులైన్లలో డ్రైనేజీ నీరు కలుస్తోందని కాలనీవాసులు తమ దృష్టికి తేగా, సమస్యను గుర్తించి పరిష్కరించాలని జలమండలి అధికారిని ఆదేశించామన్నారు. డివిజన్‌లో నెలకొన్న ఇతర సమస్యలన్నింటినీ దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మేయర్ వెంట కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాసులు, ఆర్ఓ అంజన్‌రెడ్డి, జలమండలి ఏఈ వివేక్, బీఆర్ఎస్ నాయకులు దిండు భూపేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో పేదలకు మేలు

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు యాదవ్



లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేస్తున్న శ్రీరాములు యాదవ్

పహాడీషరీఫ్: తెల్ల రేషన్ కార్డు కలిగిన పేదలంతా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు సూచించారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో 16వ వార్డు కౌన్సిలర్ బుడుమాల యాదగిరి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందెల లబ్ధిదారులకు ఆరోగ్య కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా ప్రతీ భారతీయుడు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రధాని మోదీ ప్రవేశపెట్టారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో తెల్లరేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో లక్షలాది మంది ఈ పథకానికి అనర్హులుగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పథకంలో చేరిన వారికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో మల్లేశ్, దిలీప్ గౌడ్, వై.రామారావు, మురళి, శ్రీకాంత్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక సదస్సులు అదుర్స్

విద్యార్థులను అభినందించిన అతిథులు



విద్యార్థులు తయారు చేసిన ఓఆర్ఆర్ నమూనా

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బడంగ్‌పేట లార్డ్స్ ఒలంపియాడ్ పాఠశాలలో మంగళవారం ఫాంటా సైన్స్ టికో ఎక్స్‌పో పేరుతో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించిన విషయాలను జ్ఞప్తికి తెచ్చుకుని వస్తు నమూనాలు తయారుచేసి ప్రదర్శించారు. ఫార్మాసిటీ, పరిశ్రమలు, అందమైన గ్రామం, పొల్యూషన్ లేని ప్రపంచం, చీకట్లో భయమేలా, అడవులు, వన్యసంపద, ఔటర్ రింగ్ రోడ్డు, వన్యప్రాణుల సంరక్షణ, కర్మాగారాల నుంచి వెలువడే విష కాలుష్య నివారణ, భూమిని రక్షించుకోవడం, సౌరకుటుంబం, మ్యాథమెటిక్స్‌లో చిట్కాలు, సీవీ రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్ గురించి, మానవ శరీరంలోని భాగాలు, ఆరోగ్యానికి తీసుకోవలసిన సూత్రాలు ప్రదర్శించారు. విద్యార్థుల అంతర్గత నైపుణ్యాలను వెలికి తీసేందుకు సైన్స్‌ఫెయిర్‌లు ఉపయోగపడతాయని చైర్మన్ బీరప్ప వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అనురాధ, ప్రిన్సిపాల్స్ ఆర్.సంతోశ్, బి.శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి రేఖ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

సీవీ రామన్ చిత్రపటానికి నివాళి

నాదర్‌గుల్‌లోని శ్రీవంశీధర్ స్కూల్‌లో, నాదర్‌గుల్ జెడ్పీహెచ్ఎస్‌లో, బాలాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సీవీ రామన్, అబ్దుల్ అహ్మద్‌ఖాన్ చిత్రాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి.రాజిరెడ్డి, కె.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోస్‌రాజ్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



ఏఐసీసీ సెక్రెటరీ బోస్‌రాజ్‌తో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మేయర్ పారిజాత తదితరులు

బడంగ్‌పేట్: గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా ముఖ్యులుగా విచ్చేసిన ఏఐసీసీ కార్యదర్శి బోస్ రాజ్‌ను డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి కలిశారు. నియోజకవర్గంలో సాగుతున్న హాత్ సే హాత్ జోడో యాత్ర గురించి ఆయనకు వివరించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం



చెక్కు అందజేస్తున్న ఆనందం

మహేశ్వరం: సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వర్ణగంటి ఆనందం అన్నారు. మండల కేంద్రానికి చెందిన కర్రోళ్ల శ్రీనివాస్ ముదిరాజ్‌కి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకొని సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆయనకు రూ.60 వేల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం బాధితుడికి ఆనందం చెక్కును అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు చంద్రయ్య, ఎం.నవీన్, శ్రీనివాస్‌రెడ్డి, డి.కృష్ణ, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, పరమేశ్, సురేశ్, రాజేశ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మేయర్‌కు కార్పొరేటర్ వినతి



మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ మేయర్‌కు కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్, బాపూనగర్, వెంకటేశ్వర కాలనీలలో యూజీడీ పైపులైన్ పనులు రూ.84 లక్షల నిధులతో ఏడాదిన్నర క్రితం మంజూరైనా ప్రయోజనం లేదని, కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపివేయడంతో ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మేయర్ గద్వాల విజయలక్ష్మికి వివరించారు. మురుగు సమస్య తీవ్రంగా ఉందని, పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. విజయపురికాలనీలో ఓపెన్ నాలా పనుల కోసం రూ.5.90 కోట్లు మంజూరైనా శంకుస్థాపనకు నోచుకోలేదన్నారు. ప్రజా అవసరాలు దృష్టిలో ఉంచుకుని పనులు పూర్తి చేయాలని కోరారు. డివిజన్లో అక్కడక్కడ రోడ్లు దెబ్బతిన్నాయని వాటిని మరమ్మతు చేయాలన్నారు. వేసవికాలం సమీపిస్తున్నందున అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

మెడికో ప్రీతికి నివాళి

బడంగ్‌పేట్: ర్యాగింగ్ భూతానికి బలైన వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయ మెడికో విద్యార్థిని ధరావత్ ప్రీతికి మంగళవారం నివాళి అర్పించారు. బాలాపూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద స్వేరో సర్కిల్ చిన్నారులు కొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, అశోక్, జగన్, రాహుల్ పాల్గొన్నారు.

బడంగ్‌పేట చౌరస్తాలో..

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించి న్యాయం చేయాలని ధర్నా చేపట్టారు. సీఎం కేసీఆర్ గిరిజనులు, దళితుల పట్ల వివక్ష చూపుతున్నారని ధ్వజమెత్తారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇందుమతి, ఇంద్ర, బంజార సేవా సమితి నాయకులు, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.



బాలాపూర్‌లో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న స్వేరో చిన్నారులు

మృతుడి కుటుంబానికి నేతల పరామర్శ

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో బొర్ర బాబయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బడంగ్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాల్‌నింగని జంగయ్య, సీరుడు శ్రీరాములు, కప్పాటి ఆంజనేయులు, శ్రీధర్, అనిల్, నవీన్, శివ, సతీశ్, జశ్వంత్ తదితరులున్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటాం

మహేశ్వరం: అపదలో ఉన్నవారికి తనవంతుగా సహాయం అందించి అండగా ఉంటానని నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిగురింత నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హర్షగూడ గ్రామానికి చెందిన పి.రాములు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట హర్షగూడ సర్పంచ్ వి.పాండు నాయక్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శివ, నాయకులు శశికాంత్, రాజు నాయక్, మహేందర్, రవీందర్, శ్రీకాంత్, శ్రీను,శంకర్ తదితరులున్నారు.



వార్షికోత్సవంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

మెగాసిటీ గ్రామర్ స్కూల్ వార్షికోత్సవం

మీర్‌పేట: విద్యార్థుల ఆట... పాటలు.. విచిత్ర వేషధారణలతో మీర్‌పేట గాయత్రినగర్‌లోని మెగాసిటీ గ్రామర్ హైస్కూల్ వార్షికోత్సవం ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. సోమవారం రాత్రి నిర్వహించిన ఈ వేడుకలకు ఏసీపీ రాందాస్‌తేజ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీఏ రాబిన్ జేమ్స్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రావు, పాఠశాల చైర్మన్ కే.వీ.ఆర్.మూర్తి, కరస్పాండెంట్ లక్ష్మీసంధ్యమూర్తి, ప్రధాన కార్యదర్శి ప్రియాంకమూర్తి, తదితరులు పాల్గొన్నారు.